హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న కమిటీ, కాలనీ సంక్షేమ సభ్యులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి మాట్లాడుతూ.. గత ఆరు నెలల హుండీని లెక్కించగా రూ.91.880 ఆదాయం సమకూరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి మార్గం రాజేశ్, ఆలయ కమిటీ నేతలు శ్యాంసుందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ కృషి ఎనలేనిది, వారు సమాజానికి మార్గదర్శకులని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడ మధురానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే అన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్స్‌కు సహకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణసురేందర్ యాదవ్, కొప్పుల నరసింహారెడ్డి, హయత్ నగర్ సర్కిల్ ఆసరా సంఘాల అధ్యక్షులు పార్టీ యాదిరెడ్డి, కార్యదర్శి హరినాథ్ బాబు,డా.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి త్యాగరాయకాలనీకి చెందిన అలివేళమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని శనివారం ఆమె భర్త మల్లారెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందని, అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వనస్థలిపురం: వనస్థలిపురంలోని భాష్యం లిటిల్ ఛాంప్ పాఠశాల 14వ వార్షికోత్సవాలు శుక్రవారం రాత్రి సామానగర్‌లోని భాష్యం బ్లూమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఓ సైంటిస్ట్ రమేష్‌కుమార్, భాష్యం విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి అంకమరావు ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభను చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని విశేషంగా అలరించాయి.

నిధుల కొరతతో పనుల్లో జాప్యం



భాగ్యలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతుందని కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.శనివారం ఆమె శానిటేషన్ అధికారులతో కలిసి శ్రీపురంకాలనీలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్త, చెట్ల కొమ్మలు, మట్టికుప్పల వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలలో వీధి దీపాల సమస్య ఉందని జీహెచ్ఎంసీ నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని జోనల్ కమిషనర్‌కు దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీరలేదన్నారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్పొరేటర్ వెంట దత్తు, కొండారెడ్డి, సురేష్, శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏ నర్సింగ్ ఉన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను శనివారం ఆమె ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలన్నింటిని నెరవేస్తుందని ప్రతిపక్షాలు కావాలని ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

లింగోజిగూడ: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హైదరాబద్ జోన్ ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌లోని ఆసిఫ్‌నగర్ బాలురు–2 మైనార్టీ గురుకులం, కళాశాలలో శనివారం ఆయన కామన్ డైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలను 40 శాతం పెంచిందని తెలిపారు.రాష్ట్రంలో అన్ని గురుకులలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. రుచికరమైన, శుభ్రమైన ఆహారం అందిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ లక్ష్యాలను ఛేదిస్తారని అందుకే అందరి ఒకే రకమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో కామన్ డైట్‌ను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మహేశ్వరం తహసీల్దార్ సైదులు, ఎల్‌బీనగర్ ఎస్ఐ వినోద్‌కుమార్, చీఫ్ ప్లానింగ్ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నాగోలు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని న్యూనాగోలు కాలనీలోని ఎస్టీ హాస్టల్లో శనివారం ఆయన డీఎస్ఓ వెంకటేశ్వర్లులతో కలిసి కొత్త మెనూను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. న్యూనాగోలు కాలనీలో ఎస్టీ హాస్టల్‌ను నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సిద్దు, నాయకులు కొత్త తిరుమల్ వెంకట్ రెడ్డి, గట్టు మహేష్, నరసింహ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో..

హయత్‌నగర్: విద్యార్థులు శారీరక, మానసికంగా ఎదగాలనే ఉద్దేశంతో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు డైట్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సౌమ్య అన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన న్యూ కామన్ డైట్ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. 8 ఏళ్ల తర్వాత 40 శాతం మెస్ చార్జీలు, 16 ఏళ్ల తర్వాత 200 శాతానికి పైగా కాస్మోటిక్ చార్జీలను పెంచిందని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల కన్నా ఎక్కువ సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్ట్ నాగలక్ష్మి, తాహసీల్దార్ జానకి, ప్రిన్సిపల్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

చైతన్యపురిలోని గురుకుల పాఠశాలలో..

చైతన్యపురి: చైతన్యపురిలోని సరూర్‌నగర్ గురుకుల పాఠశాలలో శనివారం ప్రారంభమైన న్యూ కామన్ డైట్ మెనూ ప్రోగ్రాంలో వైద్యాధికారిణి ఉమారాణి పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందించే సంకల్పంతో నూతన మెనూను తయారు చేసిందన్నారు.



భోజనం పరిశీలిస్తున్న పవన్‌కుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు..
టమాట రూ. 15, వంకాయ రూ. 28, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 23, బీర రూ. 55, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 45, క్యారట్ రూ. 43, దొండ రూ. 35, చిక్కుడు రూ. 40, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 37, క్యాప్సికం రూ. 53, ఆలు రూ. 33, దోస రూ. 13, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 33.
ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా గురు దత్తాత్రేయ జయంతి



పూజల్లో పాల్గొన్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం అల్కాపురి శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీ గురు దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, గోపూజ, మూల మంత్ర హవనం, మహా పూర్ణాహుతి, మంగళ నీరాజనం, స్వామి వారి పాదుకా సహస్ర నామార్చన నిర్వహించారు. దేప సురేఖ భాస్కర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మూర్తి, గౌరీ భాస్కర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



కక్షిదారులకు రాజీ ప్రతులను అందజేస్తున్న న్యాయమూర్తి జయప్రసాద్

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి. శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులలో వాదులు, ప్రతివాదులు ఏకాభిప్రాయంతో తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని సూచించారు. లోక్ అదాలత్ వేదిక ద్వారా ఏళ్ల తరబడి వాయిదా పడిన తగాదాలకు తక్షణ పరిష్కారం జరుగుతుందని, కక్షిదారులు కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మెట్రో పాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా.పట్టాభిరామారావు, రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎలన్నగారి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, లోక్ అదాలత్ సభ్యుడు రాజు గంగాపురం పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరుప్పావై ప్రవచనోత్సవం



ఆండాళ్ నిలయంలో కొలువైన అమ్మవారు

మలక్‌పేట: మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో ఈనెల 16 నుంచి జనవరి 13 వరకు 38వ, తిరుప్పావై ప్రవచనోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకురాలు, భగవత్ దాసురాలు లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం ధనుర్మాస ఆరంభం, మొదటి పాశురం, జనవరి 2న గురువారం ఉందుమదగళిత్త పాశురంపై ప్రవచనం, సౌభాగ్యవతులైన భక్తులకు పసుపు, కుంకుమ, గాజుల తాంబూలాల వితరణ, 5న ఏక్తకలంగాళ్ మాతృశ్రీ రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా అన్నదానం, 8న దీపోత్సవం, అమ్మవారికి కర్పూర నీరాజనాలు, మంగళాశాసనం, 10న వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం, 11న కూడారై వెల్లుశీర్ ఆండాళ్ తల్లికి నిరాటోత్సవం, 108 గంగాళములతో అక్కర వడిశల్ ప్రసాద నివేదన, వితరణ, 13న శిత్తూ' వంగక్కడల్ కండైద' భోగి పండుగ, ఉదయం 10.30 గంటలకు గోదా కల్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫలశృతి ఉంటుందన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- న్యాయమూర్తి అపర్ణ
- లోక్‌అదాలత్‌లో 271 కేసుల పరిష్కారం

మహేశ్వరం: రాజీ మార్గమే రాజమార్గమని మహేశ్వరం కోర్టు న్యాయమూర్తి అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మహేశ్వరం కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాల పరస్పర ఆమోదంలో సత్వర న్యాయం అందుతుందన్నారు. కక్షిదారులు అవగాహన పెంచుకొని కేసులను సయోధ్యతో పరిష్కారం చేసుకోవడం ఉత్తమ మార్గమన్నారు. సివిల్, ప్రమాద బీమా, రుణాల రికవరీ, చిట్‌ఫండ్ కేసులు, కుటుంబ వివాదాలు, ఫోన్ బకాయిలు, అబ్కారీ కేసులు, ఇతర సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులకు ముందుగానే నోటీసులు జారీ చేసి వారిని లోక్ అదాలత్‌కు పిలుస్తామన్నారు. క్రిమినల్ కేసులు(సీసీ) కేసులు–42, ఒరిజినల్ సూట్స్(సివిల్ కేసులు)–03, ఈ–పెట్టి కేసులు–163, సమ్మరీ ట్రయల్ కేసులు–1, ఏపీటీఎస్ కేసులు–62, ఇందులో తప్పులు చేసిన వారు నేరం ఒప్పుకున్న కేసులు–242, రాజీమార్గం కేసులు –29 మొత్తం 271 కేసులు పరిష్కరించి రాజీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమేశ్‌బాబు, కోర్టు సూపరింటెండెంట్ కవిత, లోక్‌అదాలత్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్, మహేశ్వరం, కందుకూరు సీఐలు వెంకటేశ్వర్లు, మక్బుల్ జానీ, ఎస్ఐలు, న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రూప్2 పరీక్షలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

హయత్‌నగర్: టీజీపీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆది,సోమవారం ప్రత్యేక బస్సులు తిప్పనున్నామని హయత్‌నగర్–1 డిపో మేనేజర్ విజయ్ శనివారం తెలిపారు. ఇందుకోసం ఎల్‌బీనగర్, హయత్‌నగర్ బస్టాండ్లలో ప్రత్యేక హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మజీద్‌పూర్‌లోని అవంతి, కేవికే కళాశాలలకు కుంట్లూర్ పల్లవి ఇంజినీరింగ్ కళాశాలల పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఎల్‌బీనగర్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సును నడపనున్నామని, దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

చాదర్‌ఘాట్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన శనివారం నుంచి ప్రారంభమైనట్లు మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇళ్ల వద్దకు వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించాలన్నారు. నియోజకవర్గం నుంచి దాదాపు 18752 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

విశ్వేశ్వరయ్య బెస్ట్ ఇంజినీర్ అవార్డుకు చైతన్య ఎంపిక



చైతన్య తోదేటి

మన్సూరాబాద్: విశ్వేశ్వరయ్య బెస్ట్ ఇంజినీర్ నేషనల్ అవార్డుకు మన్సూరాబాద్‌కు చెందిన చైతన్య తోదేటి ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) 17వ జాతీయ కాన్ఫరెన్స్ సమావేశాలను ఈనెల 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. గత కొన్నేళ్లుగా స్పానెక్స్ ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్ ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహిస్తుండడంతో అవార్డును అందజేస్తున్నారని చైతన్య తెలిపారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

నియామకం



ఉపేందర్‌గుప్తా

చైతన్యపురి: చైతన్యపురికి చెందిన బీజేపీ నాయకుడు మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తాను సెంట్రల్ సెన్సార్ బోర్డు అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా నియమిస్తూ సీబీఎఫ్‌సీ రీజనల్ ఆఫీసర్ షిఫాలి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియమితులవ్వడం ఇది రెండవ సారి.

16 నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

హుడాకాంప్లెక్స్: ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి సీఎం కప్–2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కప్‌లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ఎంపికైన సుమారు 4వేల మంది క్రీడాకారులతో జిల్లా స్థాయి పోటీలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకార వీధిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య పరీక్షలు చేసుకుని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, ప్రధాన కార్యదర్శి తుడిమిళ్ల లవకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రోజు వేణుగోపాల్, అనంతాచారి, వెంకటరమణ, వెంకటాచారి, శ్రీనివాసచారి, బావోజు రవి, నరసింహాచారి, బాలరాజు, రామకృష్ణ, రవి, రమేష్, రవిచారి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని హరిహరపురంకాలనీలో రూ.46.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరిగేటట్లు చూస్తానని, మంజూరైన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ వెంట శంకరయ్యగౌడ్, రాములు ,సత్యనారాయణ, పార్టీ నాయకులు ముత్యాలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి ఉన్నారు.

ప్రయాణికురాలి బంగారు గొలుసు చోరీ

నాగోలు: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లోని బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాగర్‌రింగ్ రోడ్ సమీపంలోని మల్లికార్జున నగర్‌లో నివాసం ఉండే కొత్తపల్లి వసుమతి ఈ నెల 12న ఓ వివాహానికి హాజరై తన వద్ద ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును తన హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని బస్సెక్కి బయలుదేరింది.మరోసటి రోజు బ్యాగును తనిఖీ చేయగా గొలుసు కనిపించకపోవడంతో బస్సులోనే చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది.

దేవాలయంలో చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్

నాగోలు: దేవాలయంలో హుండీ చోరీకి ప్రయత్నించిన పాత నేరస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం..జీడిమెట్లలోని చింతల్ వాజ్‌పేయినగర్‌లో శ్రీరామ్ నర్సింహాచారి(40) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల చోరీల బాట పట్టాడు. ఈ నెల 10న ఎల్‌బీనగర్ మన్సూరాబాద్ అయ్యప్ప దేవాలయంలో హుండీ దొంగతనానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు రావడంతో పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా శనివారం నర్సింహాచారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నర్సింహాచారిపై నగరంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో 23 పాత కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: ఇందిరమ్మ కమిటీలతో పారదర్శక పాలన కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు వారధులుగా పని చేస్తారన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన అర్జీల ఆధారంగా అధికారులు సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తిస్తారన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలను పర్యవేక్షించేందుకు 5 నుంచి 8 మందిని ప్రత్యేక పరిశీలకులను నియమించామన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి డబుల్ బెడ్రూం ఇస్తామని ఆయన హామీనిచ్చారు. అంతకు ముందు ఇందిరమ్మ కమిటీ పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్ ముదిరాజ్, వత్తుల రఘుపతి, కూన యాదయ్య, కృష్ణానాయక్, చాకలి యాదయ్య, అందుగుల సత్యనారాయణ, రాజునాయక్, బాల్‌రాజ్, లాజర్, సుభాష్, జంగయ్య, శివ, పరమేశ్ పలువురు పాల్గొన్నారు.